సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



అద్దెకు దొరకని అరక

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగినా అరకల తోనే కలుపు తీస్తున్నారు. కాడెద్దు తగ్గి అరక కూలీకి డిమాండ్ పెరిగింది. అద్దెకు అరక దొరకక పత్తి రైతులు పాట్లు పడుతున్నారు. 8లో▸



గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..

జిల్లాలో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు గోపిక, కృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

మధ్యాహ్నం వేళ వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందర్శన

మంచిర్యాలక్రైం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ శనివారం సందర్శించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం



పత్తి చేను

నెన్నెల: గత 20 రోజులుగా వర్షాలు లేక ఎండలకు వాడిపోయి నేలవాలిన పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలకు శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ప్రాణం పోసింది. వర్షం కోసం ఎదురుచూసిన రైతులు మురిసిపోయారు. ఏకధాటిగా కురిసిన వాన రైతుల ముఖాల్లో ఆనందం నింపింది. నీటి కోసం నింగివైపు చూసిన నేలతల్లి పులకించింది. నారుమడులు కొత్త జీవం పోసుకోగా, నేలవాలిన పత్తి, మొక్కజొన్న వర్షపు చినుకులకు నిగనిగలాడుతున్నాయి. సరైన భారీ వర్షాలు కురువక గ్రామాల్లోని చిన్న నీటి కుంటలు, చెరువుల్లో 60శాతం మాత్రమే నీరు చేరింది. వర్షాలు కురువకపోతాయా అనే భరోసాతో నాట్లు వేసిన రైతన్నలు అవి ఎండిపోతుంటే నీరందించి కాపాడుకుంటూ వచ్చారు. పంటలు అందకుండా పోతాయేమోనని కర్షకులు ఆందోళన చెందుతున్న సమయంలో కురిసిన వర్షం వరంగా మారింది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న అధ్యక్షుడు మారం జగదీశ్వర్

మంచిర్యాలక్రైం: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శనివారం జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించాలని, సీపీఎస్‌ను తొలగించి పాత పెన్షన్ విధానం ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీని ఆమోదయోగ్యమైన శాతంతో వెంటనే ఇవ్వాలని అన్నారు. సెప్టెంబర్ ఒకటిన అన్ని జిల్లాల్లోని మండల కేంద్రాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విద్రోహదినంగా పాటించాలని పిలుపునిచ్చారు. బదిలీల్లో మిగిలిపోయిన స్పౌస్, ఇతర ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, టీఎన్‌జీవో కార్యదర్శి పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, సతీష్‌కుమార్, తిరుపతి, అంజయ్య, సునిత. పద్మ, లత, ప్రభు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న డీసీవో నాగేశ్వర్‌రావు

జైపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని గురుకులాల డీసీవో, జైపూర్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని గురుకులంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17, 19 జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడలను సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి 70మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14బాలుర విభాగంలో మొదటి బహుమతి సుప్రతిక్‌వర్మ, రెండవ బహుమతి సాయిహృతేశ్, అండర్-17బాలురలో మొదటి బహుమతి శివప్రసాద్, రెండవ బహుమతి వంశీరాజ్, అండర్-19బాలుర విభాగంలో వెంకటేశ్, ద్వితీయ శ్రీవత్స, బాలికల విభాగంలో అండర్-14 మొదటి బహుమతి వైష్ణవి గెలుపొందినట్లు తెలిపారు. పోటీల పరిశీలకులుగా గోపాల్, దాసరి మల్లేశ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పీడీ బాబురావు, సంతోశ్, వెంకటేశ్, విశ్వంత్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ టు ఐపీఎస్

- అనుకున్న లక్ష్యం కోసం ముందుకు
- పట్టుదలతో శ్రమించి ఉన్నతస్థాయికి
- ఆదర్శం జిల్లా పోలీస్ బాస్ ప్రయాణం



సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'గొప్పగా ఆలోచించిన వారే గొప్పవారు అవుతారు..' అనే నానుడి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఎగ్గడి భాస్కర్‌కు అతికినట్లు సరిపోతుంది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా, మధ్యలో పెళ్లి, కుటుంబ బాధ్యతలు ఉన్నా లక్ష్యాన్ని మరువలేదు. తమ వారి సహకారంతో అనుకున్నది సాధించారు. క్రమశిక్షణ, ఓర్పు, శ్రమ ఉంటే ఎంచుకున్న గమ్యాన్ని కచ్చితంగా చేరుకోవచ్చని నిరూపించి నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ప్రభుత్వ టీచర్ నుంచి ఇండియన్ పోలీసు సర్వీస్(ఐపీఎస్) హోదా పొందే వరకు ఆయన సాగించిన బాట ఎంతో స్ఫూర్తిదాయకంగా కనిపిస్తోంది. ఇటీవలే ఆయనకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఐపీఎస్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు బాస్ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నాలుగో తరగతిలో తండ్రి మరణం

ఉమ్మడి నల్లగొండ(ప్రస్తుత సూర్యాపేట) జిల్లా అర్వపల్లి మండలం కోమటిపల్లికి చెందిన భాస్కర్‌కు అన్న, ఇద్దరు అక్కలు. చిన్నప్పటి నుంచే చదువులో చురుకు. సొంతూరిలో ప్రాథమిక పాఠశాలలో ఉన్నప్పుడు నాలుగో తరగతిలో తండ్రి గురువయ్య చనిపోతే, తల్లి లక్ష్మమ్మ అన్నీ తానై వ్యవహరించింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుతూ ఉన్నత లక్ష్యం చేరుకున్నారు. పదో తరగతి వరకు జెడ్పీహెచ్‌ఎస్ తిమ్మాపూర్, తర్వాత నల్లగొండలో పాలిటెక్నిక్, కరీంనగర్ డైట్ కాలేజీలో టీటీసీ, డిగ్రీ కర్నూల్ సిల్వర్ జూబ్లీ రెసిడెన్షియల్ కాలేజీలో చదివారు. డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే, డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాసి టీచర్‌గా ఎంపికయ్యారు. తర్వాత పెళ్లి చేసుకున్నారు. అయినా అక్కడితో తన ప్రయణాన్ని ఆపకుండా తన లక్ష్యం కోసం పుస్తకాలను విడిచిపెట్టలేదు. టీచర్ ఉద్యోగానికి సెలవు పెట్టి సివిల్స్‌కు సన్నద్ధం అయ్యారు. ఆ సమయంలోనే ఉస్మానియా యూనివర్సిటీలో లా డిగ్రీ చేశారు.

గ్రూప్-1 ర్యాంకర్‌గా..

ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగ భద్రత ఉన్నప్పటికీ తన జీవితాశయం నెరవేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. తన జీవిత సహచరి మాలిని సైతం ప్రభుత్వ టీచర్. దీంతో తాను కుటుంబ బాధ్యతలు తీసుకుంటాని ధైర్యం చెప్పడంతో ఆయనకు మరింత అండ దొరికొంది. మళ్లీ పట్టుదలతో చదవి కలెక్టర్ కావాలనుకున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ మళ్లీ విద్యార్థిగా మారి చదువుకు అంకితమయ్యారు. ఆ సమయంలోనే ఉమ్మడి రాష్ట్రంలో గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడింది. ఆ పరీక్షలో ఉమ్మడి రాష్ట్రంలోనే ఉత్తమ ర్యాంకు సాధించారు. కానీ స్వల్ప తేడాతో డిప్యూటీ కలెక్టర్ పోస్టు చేజారింది. దీంతో పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఎంపికై అంచెలంచెలుగా ఎదిగి తాజాగా ఐపీఎస్ హోదా పొందారు.

అన్నింటా ర్యాంకులే..

చిన్నప్పటి నుంచి డీసీపీ భాస్కర్ ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చారు. పదో తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచిన ఆయన, మళ్లీ ఎప్పుడూ చదువులో వెనుకడుగు వేయలేదు. టీటీసీ, డిగ్రీ, బీఈడీ, లా ప్రవేశ పరీక్షల్లో ఉమ్మడి రాష్ట్రంలోనే రెండో ర్యాంకర్‌గా నిలిచారు. 2000 సంవత్సరంలో డీఎస్సీలోనూ ఉమ్మడి నల్లగొండ జిల్లా టాపర్‌గా నిలిచి ఉద్యోగం సంపాదించారు. టీచర్ జాబ్‌కు సెలవు పెట్టి, 2002-05 మధ్య లా డిగ్రీ చదువుతూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. ఒక దశలో బీఈడీ లేదా? అని అందరూ అడుగుతున్నారని ఎడ్‌సెట్ రాసి స్టేట్ ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నారు. కానీ కోర్సులో చేరలేదు. 2007 చివరిలో గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడగా, 2009లో పరీక్ష రాసి ఎంపికయ్యారు. 2010లో డీఎస్పీగా మొదటి పోస్టింగ్ బాపట్ల, కామారెడ్డి, ఆసిఫాబాద్, తూప్రాన్‌లో పని చేశారు. హైదరాబాద్ నగరం, ఇంటెలిజెన్స్ విభాగంతోపాటు పలు చోట్ల వివిధ హోదాల్లో పని చేసి జగిత్యాల ఎస్పీగా పని చేసి, జిల్లాకు బదిలీపై వచ్చారు.

ఉన్నతంగా ఉండాలనే..

చిన్నప్పటి నుంచే దినపత్రికలు చదివే అలవాటు ఉంది. పత్రికల్లో వచ్చిన వాటిని చూస్తూ నేను కూడా ఉన్నతంగా ఉండాలనుకునేవాడిని. అలా చిన్నప్పుడే నాకు సివిల్స్ రాయాలనే ఆలోచన కలిగింది. అనుకున్న ఆశయం సాధించడంలో నా కుటుంబ సభ్యులు, గురువులు, స్నేహితులు, ఉన్నతాధికారుల సహకారం మరువలేనిది.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

రుణమాఫీ మాకెప్పుడో..!


- ఫిర్యాదులకే పరిమితమా..?
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅగ్రికల్చర్: పంట రుణాల మాఫీ మూడు జాబితాలు విడుదలై పది రోజులు గడుస్తోంది. మరోవైపు మాఫీ జాబితాలో పేరు లేని రైతుల ఫిర్యాదుల సంఖ్య వ్యవసాయ అధికారుల వద్ద పెరిగిపోతోంది. తమకెందుకు రుణమాఫీ కాలేదని మండలాల్లో ఏఈవోలు, జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,530 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులన్నీ పరిశీలించి రుణమాఫీ చేస్తారా.. స్వీకరణకే పరిమితం అవుతారా అనే ఆందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు. మాఫీ కాని రైతులు ఇటు వ్యవసాయ కార్యాలయం, అటు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రుణం రూ.2లక్షల కన్న ఎక్కువ ఉన్న నగదు చెల్లించినా మాఫీ కాలేదని, ఎప్పటివరకు జరుగుతుందనేది తెలియడం లేదని వాపోతున్నారు. ఫిర్యాదులు స్వీకరిస్తున్నా పరిష్కార మార్గానికి ఆదేశాలు వెలువడలేదని వ్యవసాయ, బ్యాంకు అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డు లేని రైతులు, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తేడాగా, రూ.2లక్షల కన్న ఎక్కువగా ఉన్న కారణాలతోపాటు రేషన్‌కార్డు ఉన్న, బ్యాంకు ఖాతాలు, ఆధార్, ఫోన్‌నంబర్లు సక్రమంగానే ఉన్న చాలామంది రైతులకు మాఫీ కాకపోవడం గమనార్హం. రైతుల వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌తో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు ఫోన్లు చేసి సమస్యను వివరిస్తున్నారు. వాటన్నింటినీ నమోదు చేసుకుని వ్యవసాయ కమిషనరేట్‌కు పంపిస్తున్నారు.


నాలుగో విడత అంటున్నరు..



నేను ముత్యంపల్లి గ్రామీణబ్యాంకులో పోయినేడు రూ.లక్షా 75 వేలు పంటలోను తీసుకున్నా. మూడు విడతల్లో రుణమాఫీ కాలేదు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం ఉన్నాయి. వ్యవసాయ అధికారులను అడుగుతే నాలుగో విడతలో వస్తుందని అంటున్నారు. మాఫీ అవుతుందో లేదో అర్థం కావడం లేదు

– సంకూరి పోశం, గ్రామం: కోమటిచేన్, మం: కాసిపేట

గందరగోళంగా ఉంది..



నాకు రూ.2లక్షల పంట లోను ఉంది. మూడో విడతల్లో మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులకు అన్ని కాగితాలు చూపించిన. నా భార్య పేరు మీద రూ.60వేల లోను ఉంది. ఇద్దరిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను అడుగుతే పడుతది అంటున్నరు. కలెక్టర్ ఆఫీసులోని రుణమాఫీ గ్రీవెన్స్ సెల్‌కు ఫోన్ చేసిన పడుతాయి అంటున్నారు కాని ఎప్పటి వరకనేది తెలియడం లేదు. అంతా గందరగోళంగా ఉంది.

– బొమ్మన శ్రీనివాస్, గ్రామం: కుందారం, మం: జైపూర్

ఎవరూ చెప్పడం లేదు..

నేను గ్రామీణ బ్యాంకులో రూ.లక్షా 60 వేలు లోను తీసుకున్న. ప్రభుత్వం విడుదల చేసిన మూడు విడతల్లో రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాసుబుక్ ఉన్నాయి. అన్నీ ఉన్నా మాఫీ కాలేదు. మాకు ఎప్పుడు మాఫీ అవుతుందో ఏమో తెలుస్తలేదు. రూ.రెండు లక్షలు ఉన్న కొంతమందికి మాఫీ అయ్యింది. మాకు మాఫీ ఎప్పుడు అవుతుందో ఎవరూ సరిగా చెప్పడం లేదు.

– దుర్గం లక్ష్మి, గ్రామం: కోమటిచేను, మం: కాసిపేట

భూ సమస్యల పరిష్కారానికి చట్టం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై చర్చ



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ(ఆర్ఓఆర్) చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై కలెక్టర్ ఆధ్వర్యంలో విశ్రాంత రెవెన్యూ అధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, నిపుణులు, రైతు సంఘాల నాయకులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, భూ సేకరణ ప్రత్యేకాధికారి చంద్రకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిపుణులు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ అధికారులు అందించిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న భూ రికార్డులు, నిర్వహణ పద్ధతులు పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాను రూపొందించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భూ సేకరణ, వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి మండల రెవెన్యూ కార్యాలయ స్థాయి, రెవెన్యూ డివిజనల్ స్థాయిలో పరిష్కరించి వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పాస్ పుస్తకాలు ఉన్న స్థానంలో తెలంగాణ పాస్ పుస్తకాలు ఇవ్వాలని, ధరణి పోర్టల్‌ను భూదేవి, భూమాతగా మార్చాలని, నోషనల్ పట్టా సమస్యలు పరిష్కరించాలని, వారసత్వ భూముల బదలాయింపు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో ఆబాది భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదాబైనామా భూముల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అథారిటీ ఆర్డీఓకు ఉండాలని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, నిపుణులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోర్టును సందర్శించిన విద్యార్థులు



కోర్టులో పనితీరును వివరిస్తున్న జడ్జి ముఖేష్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి బస్తీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టారు. శనివారం నో బ్యాగ్ డేను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. జూనియర్ సివిల్ కోర్టు, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, ఫైర్‌స్టేషన్, గ్రంథాలయం, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిలను పరిశీలించారు. అక్కడి పనితీరు, అధికారుల విధులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేష్ మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ వ్యవస్థ, ఇతర శాఖల పనితీరుపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుబాయి, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు.

'పీఎస్సార్'కు ఖాయమేనా?

- మంత్రివర్గంలోకి మంచిర్యాల ఎమ్మెల్యే
- ఆయనకే బెర్త్ అంటున్న అనుచర వర్గం
- జిల్లా నుంచే పోటీలో 'గడ్డం' బ్రదర్స్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ రెండో విడత చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు(పీఎస్సార్)కు బెర్త్ ఖాయమని ఆయన అనుచర వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. మొదటి విడతలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం కల్పించలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఒకరికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో గత కొంత కాలంగా రెండో విడత మంత్రివర్గ విస్తరణలో పీఎస్సార్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పీసీసీ అధ్యక్ష పదవితోపాటు నామినేటెడ్ పోస్టులు, కేబినెట్ విస్తరణ జరుగుతుందనే నేపథ్యంలో పీఎస్సార్ అనుచర వర్గం ఆశలు పెట్టుకుంది. మరోవైపు జిల్లా నుంచే బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్ పోటీలో ఉన్నారని వారి అనుచరులు చెప్పుకుంటున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను ఎమ్మెల్యే పీఎస్సార్ కలిశారు. కాంగ్రెస్ అధిష్టానం వద్ద రాష్ట్ర కీలక నాయకులంతా ఉండడంతో మంత్రివర్గ కూర్పులో స్థానిక ఎమ్మెల్యేకు స్థానం ఖాయమైనట్లు ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. అంతేగాక రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఎమ్మెల్యే పీఎస్సార్‌కు అండ కూడా ఉండడంతో ఆయనకే అవకాశాలు మెండుగా ఉన్నట్లు చెబుతున్నారు.

ఈ నెల 28న ప్రకటన?

మంత్రివర్గ విస్తరణలో జిల్లా నుంచి ఎవరికి అవకాశం ఉంటుందోనని ఈ నెల 28న ప్రకటన రావొచ్చని సమాచారం. ఈ క్రమంలో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎవరికి స్థానం కల్పించాలో దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. పోటీలో ఉన్నవారిని నచ్చజెప్పడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సామాజిక సమీకరణాలను దృష్టి పెట్టుకుని అధిష్టానం ఆలోచిస్తున్న క్రమంలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోనని టెన్షన్ నెలకొంది. మరోవైపు 'గడ్డం' సోదరులు సైతం తమకే పదవి దక్కాలంటూ ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్న తరుణంలో అధికారికంగా వెలువడే వరకు అధికార పార్టీ కేడర్‌లో ఆసక్తి నెలకొంది.

సీఎం, 'భట్టి'లను కలిసిన ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాలక్రైం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఢిల్లీలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం, మంత్రులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించిన ట్లు సమాచారం. పలు అభివృద్ధి కార్యక్రమాల ను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

పెద్దపులి అడుగులే..

- గుర్తించిన అటవీ అధికారులు
- అప్రమత్తమైన సిబ్బంది



అధికారులు గుర్తించిన పెద్దపులి అడుగులు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడించగా.. తాజాగా అడుగులను కనుగొన్నారు. మూడు రోజులుగా అటవీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తిరిగినట్లు ఆనవాళ్లు గుర్తించారు. జువ్విగూడ గొండుగూడకు చెందిన ఆవు, దూడపై పులి దాడి చేసి గాయపర్చింది. దీంతో పులి సంచరిస్తున్న విషయం బయటకు వచ్చింది. డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట్ రేంజ్‌ల పరిధిలో పని చేస్తున్న అటవీ సిబ్బంది పులి ఆనవాళ్ల కోసం గాలించారు. వర్షం వల్ల అడుగులు గుర్తించలేకపోయారు. శనివారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అడుగులను గుర్తించారు.

ఆవాసం ఉంటుందా..

రెండేళ్ల తర్వాత కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి పులి రావడంపై అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులి ఇక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా పలుమార్లు పెద్దపులి జన్నారం డివిజన్‌కు వచ్చినా రాకపోకలు తప్ప ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకున్న దాఖలాలు లేవు. చాలా రోజుల తర్వాత డివిజన్‌లో సంచరిస్తుండడంతో ఆవాసం ఏర్పాటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. వన్యప్రాణుల సంఖ్య పెరగడం, అనువైన ప్రదేశాలు ఉండడం ఆవాసానికి అనుకూలం. కానీ పశువులు లోనికి మేతకు వెళ్లడం, మనుషుల అలజడి ఉంటే పులి ఇక్కడి నుంచే వెళ్లే అవకాశం ఉంది.

గడ్డి క్షేత్రాలు, వన్యప్రాణులు

డివిజన్‌లో పులి కోసం గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచుతున్నారు. దీంతో వన్యప్రాణుల సంతతి పెరిగి పులికి సరిపడా ఆహారం ఉంటుందని అధికారుల అంచనా. గత నాలుగేళ్లుగా గడ్డి క్షేత్రాల నిర్వహణపై దృష్టి సారించడం వల్ల వన్యప్రాణుల సంఖ్య రెట్టింపైనట్లు తెలుస్తోంది. పులి ఇక్కడ ఉంటే సరిపడా ఆహారం ఉందని అధికారులు అంటున్నారు. డివిజన్‌లో పులి ఎన్ని రోజులు ఉంటుందో వేచి చూడాలి.

వసతిగృహాల్లో మోనూ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

మంచిర్యాలఅర్బన్: వసతిగృహాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, మెనూ ప్రకారం వేడివేడి భోజనం అందించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉపసంచాలకుడు పి.రవీందర్ రెడ్డి వసతిగృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. శనివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఎస్సీ వసతిగృహాల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం వ్యాధుల దృష్ట్యా వసతిగృహ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, జ్వరాల బారిన పడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుని వసతిగృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. వసతిగృహ సంక్షేమ అధికారులు రికార్డులను పూర్తి చేసుకోవాలని, హెడ్ క్వార్టర్స్, స్థానికతను కచ్చితంగా పాటించాలని అన్నారు. మోనూ ప్రకారం భోజనం అందించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రవీందర్, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై జిజ్ఞాస పెంచుకోవాలి



ప్రయోగాలు చేసి చూపిస్తున్న మధుబాబు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై జిజ్ఞాస పెంచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్.మధుబాబు సూచించారు. శనివారం హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు జిజ్ఞాస సంచార వాహనం వచ్చింది. విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమక్షంలో కొన్ని వినూత్న ప్రయోగాలను వివరిస్తూ వారిలో ప్రేరణ కలిగించారు. విద్యార్థుల ఆవిష్కరణలకు ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి అనేక కార్యక్రమాలు చక్కని అవకాశాలు కల్పిస్తున్నాయని, వివిధ ఆవిష్కరణలకు రూపకల్పన చేసి అనేక సమస్యలకు పరిష్కారం చూపాలని తెలియజేశారు. కార్యక్రమంలో జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్, జిజ్ఞాస సంచార వాహనం ఇన్‌స్ట్రక్టర్లు సాయి, సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఓబీసీ న్యాయవాదుల సదస్సు

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంకు జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో ఆదివారం ఓబీసీ న్యాయవాదుల సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యుడు భుజంగ్‌రావు తెలిపారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో బీసీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగ్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని బీసీ న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎల్‌పీఏ సభ్యులు, న్యాయవాదులు నరేందర్, మహేష్, శాంసన్, సీనియర్ న్యాయవాదులు కర్రె లచ్చన్న, కోట మల్లయ్య, సందాని, మురళీకృష్ణ, రాజేష్, తరుపతి కొట్టే నటేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కోటయ్య మృతదేహం

లక్సెట్టిపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లికి చెందిన కోటయ్య (55) శుక్రవారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలో ఉన్న బంధువు ఇంటికి వచ్చాడు. రాత్రి దండేపల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మంచిర్యాల ఎస్‌బీఐ ఎదుట ...



ఎస్‌కే మహ్మద్ మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జాఫర్‌నగర్‌కు చెందిన ఎస్‌కే మహ్మద్(50) కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగోలేక ప్లాస్టిక్ డబ్బాలు, పేపర్లు ఏరుకుంటూ కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిర్పూర్(టి): మండలంలోని పారిగాం గ్రామ సమీపంలో పెన్‌గంగ నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. నదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చిందని వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు బ్లూ కలర్ ప్యాంట్, లైట్ గ్రీన్ కలర్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

జ్వరంతో యువకుడు మృతి

ఖానాపూర్: పట్టణానికి చెందిన తొంటుకూరి సరిత–శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు రంజిత్ (27) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సదరు యువకుడికి మూడురోజుల క్రితం జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ జ్వరతీవ్రత తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ప్రవళిక, కూతురు (1) ఉన్నారు.

అద్దెకు దొరకని అరక

- యాంత్రీకరణ పెరిగినా.. అరకతోనే కలుపుతీత
- కాడెడ్లు తగ్గడంతో అరక కూలీకి మస్తు డిమాండ్
- పత్తి చేలల్లో కలుపు నియంత్రణకు రైతుల పాట్లు



పత్తి చేనులో కాడెడ్లతో దౌరకొడుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో యంత్రసాగు పెరిగింది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో కాడెడ్లు కనుమరుగయ్యాయి. గత నెలలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు పంటచేలలో కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ప్రస్తుతం పంటచేలలో కలుపుతీత పనుల్లో బిజీగా మారారు. కలుపు నియంత్రణకు కూలీలతో పాటు దౌర కొట్టేందుకు అరకల కోసం వెంపర్లాడుతున్నారు. దీంతో కాడెడ్లు ఉన్న అరక కూలీ రైతులకు డిమాండ్ పెరిగింది. దుక్కి దున్నడంతో మొదలు, పంట ఇంటికి చేర్చే వరకు ట్రాక్టర్ల వినియోగం పెరిగినా ఒకదశలో రైతులకు కాడెడ్ల అవసరం తప్పడంలేదు. ఎన్ని యంత్రాలు ఎన్ని వచ్చినా అరకసాగుకు మాత్రం డిమాండ్ తగ్గడంలేదు. పత్తి విత్తనాలు విత్తాలన్నా అరకతో సాళ్లు పట్టాల్సిందే. పత్తిలో కలుపు నివారణకు అరకతో దౌర కొట్టాల్సిందే. నారుమడి కలియ దున్నాలంటే అరక కావాల్సిందే. నాటు వేసేందుకు జంబు కొట్టాలన్నా కాడెడ్ల అవసరం తప్పనిసరి అంటున్నారు రైతులు.

అరకకు రూ.2,200 డిమాండ్

ఉమ్మడి జిల్లాలో 17.20 లక్షల ఎకారల్లో వివిధ పంటలు సాగు అవుతుండగా ఇందులో ప్రధానంగా పత్తి, వరి సాగు అవుతోంది. గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిచేలలో కలుపుమొక్కలు విపరీతంగా పెరిగాయి. వారం రోజులుగా ఎండలు కొడుతుండడంతో రైతులంతా కలుపుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ఆలస్యమైతే పంట ఎదుగుదల లేకుండా పోతుంది. మళ్లీ వర్షాలు కురిస్తే కలుపు తీయడం, ఎరువులు వేసుకోవడం కుదరదు. దీంతో ఇటు కూలీలలతో పాటు అటు దౌరకొట్టేందుకు అరక కోసం వెంపర్లాడుతున్నారు. డిమాండ్ పెరగడంతో అరక కూలి రోజుకు రూ.2 వేల నుంచి రూ.2,200 తీసుకుంటున్నారు. అయినా అరక దొరకడం లేదని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో తగ్గిన కాడెడ్లు..

ఒకప్పుడు ఏ రైతు ఇంటిముందు చూసినా కాడెడ్లు, ఎడ్లబండ్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం 70 శాతం మంది రైతుల ఇళ్లముందు ఎడ్లబండ్లకు బదులు ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా దిగుబడులు పెంచుకోవడం, శ్రమ తగ్గించుకోవడం, సమయం ఆదా చేసుకునేందుకు యంత్రాల సాగు చేస్తున్నారు. చేను చదును కాడి నుంచి దిగుబడి వచ్చిన పంట అమ్మకానికి మార్కెట్‌కు తరలించే వరకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. దీంతో కాడెడ్లకు మేతతో పాటు వాటి ఆలనాపాలన చూసుకోవడం వీలుకావడం లేదని చాలామంది రైతులు ఎడ్లను అమ్ముకుని ట్రాక్టర్లు విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఒకానొకదశలో వాటి అవసరం తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పత్తి చేలలో చెట్లమధ్య దౌరకొట్టాలంటే ట్రాక్టర్లతో వీలుకాదు. చెట్లు విరిగిపోవడం, టైర్ల కింద పడి నలిగిపోవడం జరుగుతుంది. ఈ సమయంలో కాడెడ్లతో దౌరకొట్టడం సులభతరంగా ఉంటుందని రైతులు అరకనే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఆలస్యమైతే పంట ఎదగదు..



గత నెలలో కురిసిన వర్షాలకు పత్తిలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. అరక అయితే సాళ్ల మధ్యలో ఉన్న గడ్డిపోతుంది. ట్రాక్టర్‌తో అయితే చెట్లు ఇరుగుతై. గతంలో కాడేడ్లు ఉండే. వాటిని అమ్మి ఇప్పుడు అరక కోసం తిరుగుడైతంది. ఆలస్యమైతే గడ్డి పెరిగి పంట ఎదగదు.

– జాపాతి కొమురయ్య, నెన్నెల

ముందే పైసలిచ్చిపోతుండ్రు



పత్తి విత్తనాలు విత్తడానికి సాళ్లు పెట్టేందుకు, వరి నారుమడి సిద్ధం చేయడానికి, పత్తిలో కలుపు నివారణకు దౌరలు కొడుతున్నాం. మా వాడలో మాకే ఎడ్లు ఉండడంతో దౌరకొట్టడానికి రైతులు ఎక్కువగా అడుగుతున్నారు. అరకకు రావాలని నాలుగు రోజుల ముందే పైసలు ఇచ్చి పోతుండ్రు.

– భీమరాజుల పవన్, నెన్నెల

ముదిరిన నారుతో నాటేయడం ఎలా?

- తీసుకోవాల్సిన జాగ్రత్తలు



ముదిరిన వరి నారు

చెన్నూర్‌రూరల్: రైతులు వరి నారు పోసి విస్తారంగా వర్షాలు కురిసేవరకు ఎదురుచూస్తారు. ఈక్రమంలో నాటు వేసేందుకు ఆలస్యం కావడంతో నారు ముదిరిపోతుంది. ముదిరిన నారుతో నాట్లు వేయడం ఎలా? తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెన్నూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ వివరించారు. ముదురు నారును నాటితే పంట దిగుబడి తగ్గుతుంది. నాటు పైపైన నాటితే పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాటిన తర్వాత ప్రతీ రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలి బాటలు తీయాలి. కుదుళ్ల సంఖ్య పెంచి కుదురుకు 4, 5 మొక్కల చొప్పున నాటు వేయాలి. కుదుళ్లను దగ్గర దగ్గరగా నాటుకోవాలి. సిఫార్సు కంటే 25 శాతం పెంచి రెండు దఫాలుగా 70 శాతం దమ్ములో 30 శాతం అంకురం దశలో వేయాలి. 2 బస్తాల యూరియా, ఒక బస్తా డీఏపీ, ఒక బస్తా పొటాష్ యూరియాను మూడు భాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ము దశలో, అంకురం దశలో, బురద పదనులో మాత్రమే సమానంగా చల్లాలి. రెండు రోజుల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. డీఏపీ ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో సగం వేయాలి. జింకు లోపాన్ని నివారించేందుకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ చొప్పున కలిపి అయిదు రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువుతో జింక్ సల్ఫేట్ ఎరువును కలిపి వేయరాదు. కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి.

పురుగుల నివారణ:

వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ ద్రావణాన్ని లేదా సోనామిడాన్ 40 శాతం 2ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్టదశలో కార్బోఫ్యూరాన్ 3 కిలోల గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున చల్లుకోవాలి.

దోమల నివారణకు:

వరిలో దోమల నివారణకు కాలిబాటలు వదలాలి. క్లోరిఫైరిపాస్ 2 ఎంఎంల్‌ను లేదా ఇమిడాక్లోవిడాన్ 40 శాతం 2 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తాటాకు తెగులు నివారణకు పోసినోఫాస్ 2ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలాంటి పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి.

కౌన్సిలర్‌కు కేటీఆర్ పరామర్శ



సత్యనారాయణను పరామర్శిస్తున్న కేటీఆర్

నస్పూర్: పోలీసులు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపిస్తూ మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల మాజీ ఎంపీపీ, నస్పూర్ మున్సిపల్ 21వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం పరామర్శించారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కొల్లూర్‌లో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ ఎస్సీ కాలనీలో విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శనివారం 'మంచంపట్టిన కొల్లూర్' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరపీడితుల నుంచి రక్తనమునాలను సేకరించి మందులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులతో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీవాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్‌ఎం విజయ, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



ఐకే ఓసీపీని సందర్శిస్తున్న అధికారులు

జైపూర్: 'రక్షణే పథమం, రక్షణే ఎల్లప్పుడూ, రక్షణే చివరకు' అనే నినాదంతో ముందుకు సాగుతూ ప్రతిఒక్కరూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కార్పొరేట్ రక్షణ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. ఇందారం ఓపెన్‌కాస్టు గనిని శనివారం బెల్లంపల్లి ఏరియా రక్షణ మేనేజర్ రఘుకుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడే సంస్థ ముందుకు వెళ్తుందన్నారు. ప్రతీ ఉద్యోగి, అధికారి తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందారం గని ప్రాజెక్టు అధికారి ఏవీ.రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గని మేనేజర్లు వెంకటేశ్వర్లు, రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలోని రూ.62 వేలు మాయం

భీమారం: మండల కేంద్రానికి చెందిన మెండె పున్నం బ్యాంకు ఖాతాలో నుంచి సైబర్ నేరగాళ్లు రూ.62,700 మాయం చేశారని ఎస్సై బి. రాములు శనివారం తెలిపారు. ఈ నెల 15న జరిగిన ఈ సంఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మెండె పున్నం భీమారంలోని ఎస్‌బీఐ ఖాతానంబర్ 62231925513 నుంచి రూ.49,700, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నంబర్ 50200091864747 నుంచి రూ.13,000 ప్రైవేట్ బ్యాంక్‌లకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండి ఫోన్‌ను గమనించలేదని, కూలీలకు డబ్బులు ఇచ్చేందుకు ఫోన్‌పే ద్వారా పంపించగా జీరో బ్యాలన్స్ చూపించిందన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. సెల్‌ఫోన్‌లను చిన్నపిల్లలతో పాటు అపరిచిత వ్యక్తులకు ఇవ్వవద్దని ఎస్సై సూచించారు. ఒకవేళ సైబర్ నేరగాళ్లు ఖాతాలనుంచి డబ్బులు చోరీ చేస్తే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల రాళ్లవాగు బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను శనివారం పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న బ్లూకోర్ట్ కానిస్టేబుళ్లు ప్రదీప్, సంపత్ ప్రాణాలు కాపాడారు. సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం పాత మంచిర్యాలకు చెందిన ఆకుతోట లక్ష్మి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై రాళ్లవాగు బ్రిడ్జిపై నుంచి దూకేందుకు యత్నిస్తుండగా అటుగా వెళ్తున్న కానిస్టేబుళ్లు గమనించి మహిళను బ్రిడ్జిపై నుంచి కిందకు దించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భర్త సతీష్, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదన్నారు. మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్ల ప్రదీప్, సంపత్‌కు నగదు బహుమతి అందజేశారు. ఇరువురిని సీపీ, శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

యువకుడు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన ఆనందపు రవితేజ (24) ఇటీవలే ఓ మెడికల్ దుకాణాన్ని ప్రారంభించాడు. దీంతో పాటు ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో పత్తి పంట వేశాడు. ఇందుకు రూ. 5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. శనివారం చేనుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి పురుగుల మందు తాగాడు. తన స్నేహితుడికి ఫోన్‌చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. నిర్మల్‌లోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీకాంత్



నియామక పత్రం ఇస్తున్న ప్రీతం

కౌటాల: టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రత్నం శ్రీకాంత్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో శనివారం ఎస్సీ కమిటీ రాష్ట్ర చైర్మన్ ప్రీతం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకుడు దుర్గం మారుతి ఉన్నారు.

బాలింత మృతి



జల్‌కర్ దేవి (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన బాలింత జల్‌కర్ దేవి (20) శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. జలకర్ దేవి ఐదు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శుక్రవారం వైద్యులు డిశ్చార్జ్ చేయగా అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ విషయంపై మండల వైద్యాధికారి సర్ఫరాజ్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా మృతురాలి భర్త వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో శ్రీ విఘ్నేశ్వరా యూత్ సభ్యులు ఆర్థిక చేయూత అందించారు.

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు



గ్యాస్ తూకాన్ని పరిశీలిస్తున్న అధికారి

దస్తురాబాద్: హెచ్‌పీ సిలిండర్‌లో గ్యాస్ తక్కువగా వస్తుందని మండల కేంద్రానికి చెందిన సాయికుమార్, అభిలాష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తూనికలు కొలతల శాఖ అధికారులకు సమాచారం అందించారు. తూనికలు, కొలతల శా ఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి భూలక్ష్మి శనివారం మండల కేంద్రానికి వచ్చిన 63 గ్యాస్ సిలిండర్లను తనిఖీ చేశారు. సిలిండర్లలో గ్యాస్ తక్కువగా ఉండడంతో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని భూలక్ష్మి తెలిపారు.

అయోధ్య రామయ్యకు ఉడతా భక్తిగా..

- బియ్యపు గింజలతో తీర్చిదిద్దిన కళాఖండం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందించిన నిర్మల్ కళాకారుడు రాజేంద్ర



అయోధ్య రామాలయంలో తాను రూపొందించిన చిత్రాన్ని ప్రదర్శిస్తున్న రాజేంద్ర

నిర్మల్‌ఖిల్లా: ప్రతీ వ్యక్తిలో కళ దాగిఉంటుంది. అలాంటి విభిన్న శైలే నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బిట్లింగు రాజేంద్రది.. సూక్ష్మచిత్రకళ (మినీయేచర్ ఆర్ట్) అని పిలిచే ఈ రంగంలో అద్భుత నైపుణ్యంతో అనేక రకాల చిత్రాలు, దేవుని ప్రతిమలు తీర్చిదిద్దాడు. అయోధ్య శ్రీరామ జన్మభూమి పునః ప్రతిష్ఠాపన సమయంలో శ్రీరాముడి చిత్రపటాన్ని ఆలయంతో సహా బియ్యపు గింజలతో తీర్చిదిద్దా డు. ఆ అయోధ్య రాముడికి ఉడతాభక్తిగా ఆ చిత్రపటాన్ని సమర్పించాడు. చూస్తుంటే మామూలు పెయింటింగ్ లాగా కనిపించే ఈ చిత్రం, తీక్షణంగా పరిశీలిస్తే శ్రీరాముడి ప్రతిరూపం కనిపిస్తుంది. ఇంకా దగ్గరగా పరిశీలిస్తే బియ్యపు గింజలపై తెలుగు, హిందీ, ఆంగ్లభాషల్లో రామ నామం గోచరిస్తుంది. బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన బిట్లింగు రాజేంద్ర అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో ఈ కళాఖండాన్ని తీర్చిదిద్ది ఇటీవల తుదిమెరుగులను పూర్తి చేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య పుణ్యక్షేత్రానికి వెళ్లి శుక్రవారం శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వారికి తాను రూపొందించిన కళాఖండాన్ని అందజేశాడు. ట్రస్ట్ ఏర్పాటుచేయనున్న మ్యూ జియంలో ఈ కళాఖండాన్ని వీక్షకులకు అందుబా టులో ఉంచనున్నట్లు రాజేంద్ర 'సాక్షి'తో తెలిపారు. గతంలో వీరు గీసిన సూక్ష్మచిత్రం హార్వార్డ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది.

గంజాయి, డ్రగ్స్ అరికట్టడంలో విఫలం

- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ



మాట్లాడుతున్న అందె మంగ

ఖానాపూర్: రోజురోజుకూ పెరుగుతున్న నేరాలకు కారణమైన గంజాయి, కల్తీ మద్యం, డ్రగ్స్ అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. శనివారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఏడో మహాసభకు హాజరై మాట్లాడారు. పెరుగుతున్న నేరాలకు పాలకుల వైఫల్యమే కారణమన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతోందని, పనిచేసే చోటే లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. మహిళలపై ప్రతీ రోజు ఎక్కడో ఓ చోట లైంగికదాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో మత్తుకు బానిస అవుతున్నారన్నారు. లైంగిక వేధింపుల చట్టాలు ఉన్నప్పటికీ కేసులు నమోదు చేయడంలో యంత్రాంగం విఫలమవుతోందన్నారు. అంతకుముందు హరిత జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిళా అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, నాయకులు మల్లక్క, లావణ్య, చంద్రకళ, రాజేశ్వరి, విజయలక్ష్మి, అనసూయ, సునారికారి రాజేశ్, గోపి, నర్సయ్య, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

కవలలకు జన్మనిచ్చి, తల్లి అనంతలోకాలకు

- గుండెపోటుతో బాలింత మృతి



దీక్ష (ఫైల్)



తల్లిని కోల్పోయిన కవల పిల్లలు

ఇంద్రవెల్లి: ఇద్దరు కవలలకు జన్మనిచ్చి తల్లి అనంతలోకాలకు వెళ్లిన సంఘటన మండలంలోని అందునాయక్ తాండలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వాగ్మరే దీక్ష (28)కు ఈ నెల 22న మూడోకాన్పులో పురిటి నొప్పులు రావడంతో భర్త గోవింద్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 23న సిజేరియన్ ద్వారా ప్రసవం చేయగా మగ కవలలకు జన్మనిచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే శనివారం గుండెపోటు రావడంతో మృతి చెందింది. పుట్టుకతోనే తల్లిని కోల్పోయిన కవలలను చూసి బంధువులు కంటతడి పెట్టారు. అందునాయక్‌తాండలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్‌షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

భైంసాటౌన్: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాకు గురై ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌రోడ్‌లో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టగా ఏపీనగర్‌కు చెందిన బండారి మారుతి (45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మారుతి తిరిగి రాలేదు. దీంతో అతని కుమారుడు గణేశ్ శనివారం ఉదయం 8.30 గంటలకు భవన నిర్మాణం జరుగుతున్న చోటుకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. చేతిలో విద్యుత్ వైరు ఉండడంతో విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. అయితే, సదరు భవన యజమాని విద్యుత్ కనెక్షన్ లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు.